క్లుప్తంగా

రిటైర్డ్ శానిటరీ అధికారికి సత్కారం



సత్కార కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి శానిటరీ విభాగంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ పొందిన రామారావును కార్పొరేటర్ గులిగిందల లావణ్య సత్కరించారు. స్థానిక వైష్ణవి కల్యాణ మండపం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రామారావు దంపతులకు శాలువా కప్పి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి



కోటేశ్వరరావు

గోపాలపట్నం: ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వెస్ట్ జోన్ అధ్యక్షుడిగా పొలమరశెట్టి కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలు వేయనున్నట్టు తెలిపారు. అలాగే లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తల్లిదండ్రుల హక్కులను, విద్యార్థుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానని కోటేశ్వరరావు తెలిపారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేప చేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో సిరిజ్యోతి పూజ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం అమ్మవారికి చిత్ర కంకణ అలంకారం సర్వాంగ సుందరంగా జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ, రాత్రి శ్రీరుద్ర సహిత–శ్రీవారాహి హోమం నిర్వహించారు. ఈ హోమం ద్వారా కొత్త వ్యాపారాలు, ప్రాజెక్టుల్లో విజయాలు కలుగడంతోపాటు, కర్మ దోషాలు, ప్రతికూలతలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. బుధవారం రాత్రికి ఖడ్గమాల సహిత వారాహి హోమం నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో గురుమాత చేతుల మీదుగా అన్నసమారాధన చేశారు.



ప్రకాష్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు



40వ వార్డులోని ప్రభుత్వ పాఠశాల వద్ద అపరిశుభ్రంగా పరిసరాలు

పారిశుధ్య లోపం..

- దుర్గంధంతో ప్రజల అవస్థలు
- తరచూ పీడిస్తున్న వ్యాధులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మురుగు కాలువల సమస్య ఇక్కడి ప్రజలను వేధిస్తోంది. ఎక్కడా భూగర్భ మురుగు కాలువలు లేకపోగా, ఉన్నవి కూడా సరైన నిర్వహణకు నోచుకోక ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలువలు శిథిలం కావడం, ఉన్నవి ఇరుగ్గా మారడంతో మురుగు రోడ్డుపైనే పారుతోంది.

పేరుకుపోయిన చెత్త.. పందుల సంచారం

జీవీఎంసీ 40, 62, 63 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మల్కాపురం మార్కెట్‌లోనూ వీధులన్నీ చెత్తాచెదారంతో నిండిపోయాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి, రోడ్డు నిండా వ్యర్థాలే కనిపిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందుల సంచారం అధికమై, వీధులన్నీ దుర్గంధభరితమై, ప్రజలు వీధుల్లో తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. మరోవైపు దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోడ్డుపై వ్యర్థాలు ఉండడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. ముందే ఇరుకు రోడ్లు.. ఆపై వ్యర్థాలతో నిండిపోవడంతో వాహనాలు జారిపడి, ప్రమాదాలు జరుగుతున్నాయి. లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీలు సైతం పర్యవేక్షణ లేక దీనస్థితిలో ఉన్నాయి. చెత్తతో పాటు ఇటీవల భవన నిర్మాణ వ్యర్థాలను సైతం రాత్రి సమయాల్లో వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా డంప్ చేస్తున్నారు. దీంతో ఇవి రోడ్లా.. డంపింగ్ యార్డ్‌లా అనే సందేహం కలుగుతోంది.

మూగజీవాల మృత్యువాత

ఈ చెత్తలోనే ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు ఉండడంతో ఆవులు తదితర మూగజీవులు వీటిని ఆహారంగా తీసుకుని మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజలు తెలియజేస్తున్నారు. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

నిర్వహణ లేక...కొత్తవి నిర్మించక...

పారిశ్రామిక ప్రాంతంలో పట్టణ ప్రణాళిక పనుల్లో భాగంగా మురుగుకాలువలు నిర్మించాల్సిన అధికారులు, పాలకులు అసలు ఆ ఊసే ఎత్తడంలేదు. గతంలో నిర్మించినవి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదు. మురుగు కాలువలపై నిరంతర పర్యవేక్షణ లేక వ్యర్థాలు పేరుకుపోయి దీనస్థితిలో ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముందుకు సాగని యూజీడీ ప్రతిపాదనలు

పారిశ్రామిక ప్రాంతంలో మురుగు సమస్య దూరం చేసేందుకు భూగర్భ మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. అధికారులు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసినా, భూగర్భ కాలువల అంశంలో మాత్రం పురోగతి లేకుండా పోయింది. దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలే ఉండడంతో, పరిస్థితి దయనీయంగా మారింది.



40వ వార్డులో చెత్తా చెదారంతో నిండిపోయిన డ్రైనేజీ

జ్వరాలతో బాధపడుతున్నాం



డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. వీధులన్నీ దోమల సామ్రాజ్యంగా మారిపోయాయి. పగలు ఈగలు, రాత్రుళ్లు దోమలు.. ఇదీ పరిస్థితి. దీంతో మా ప్రాంతంలో అందరం తరచూ ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నాం. విషజ్వరాల బారినపడుతున్నాం. అధికారులు స్పందించాలి, మురుగు సమస్యను పరిష్కరించాలి.

– సుజాత, మల్కాపురం

అధికారులు పర్యవేక్షించాలి



పారిశ్రామిక ప్రాంతంలోని మురుగుకాలువలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. మురుగు ఎప్పటికప్పుడూ పారే విధంగా చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు నిలిచిపోకుండా చూడాలి.

– లక్ష్మి, 63వ వార్డు, క్రాంతినగర్

డెంగ్యూపై అవగాహన తప్పనిసరి



డెంగ్యూ అవగాహన ర్యాలీలో పాల్గొన్న శానిటరీ, మలేరియా అధికారులు

మల్కాపురం: డెంగ్యూ తదితర విష జ్వరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ సూచించారు. డెంగ్యూ మహోత్సవ కార్యక్రమాన్ని 60వ వార్డు గుల్లలపాలెంలో మంగళవారం నిర్వహించారు. జీవీఎంసీ జోన్–5 మల్కాపురం ఏరియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయ డెంగ్యూ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల రోజుల్లో పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో ఒక్కో రోజు, ఒక్కో కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ ఇన్ఫెక్షన్లు బాగా పెరిగాయన్నారు. పరిసర ప్రాంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలపై పై కప్పులను అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ విడుదల



సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

మల్కాపురం: కార్మిక హక్కులు, చట్టాలపై ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద గల సీఐటీయూ కార్యాలయం వద్ద సమ్మె పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.అనీల్‌కుమార్ తదితరులు పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. దేశంలో గల ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడమే కాకుండా, పలు పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. నిధులనిచ్చి ప్రభుత్వరంగ పరిశ్రమలను ఆదుకోవాల్సిన దిశగా ఆలోచన చేయడం లేదన్నారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులకు నష్టం కలిగే విధంగా కేంద్రం పాలన సాగిస్తోందని మండిపడ్డారు. నగరంలో యోగా వంటి కార్యక్రమం ద్వారా లక్షలాది జనాన్ని తరలించి సంబరాలను చేసుకున్న కూటమి సర్కార్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అవుతుంటే అదే జనాన్ని తీసుకువెళ్లి కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. మోదీ ఆలోచనలకు వంత పాడుతున్న కూటమి సర్కార్‌కు జనం తప్పక బుద్ధి చెబుతారన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ ఏర్పాటు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: ఓపీ జారీలో జాప్యాన్ని తగ్గించడానికి త్వరలోనే కంప్యూటర్‌తో పాటు ప్రింటర్ ఏర్పాటు చేస్తామని గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సుజాత తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన రోగులకు యాప్ సోపాలు అన్న కథనానికి ఆమె స్పందించారు. ఆయుష్మాన్ భారత్ (ఏబీడీఎం) కార్యక్రమంలో భాగంగా మొబైల్ యాప్ ద్వారా ఆధా కార్డు, మొబైల్ నంబర్ నమోదు చేసి ఓపీ టికెట్ ఇస్తున్నామని తెలిపారు. దీని వల్ల జాప్యమవుతోందని పేర్కొన్నారు. కొద్దిరోజులు రోగులు సంయమనం పాటించి, సిబ్బందికి సహకరించాలని కోరారు. కంప్యూటర్, ప్రింటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో సులువవుతుందని తెలిపారు. 30 పడకల ఆస్పత్రిని త్వరలో 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

దేశ ఖజానాకు జీఎస్టీ వెన్నెముక

మద్దిలపాలెం: జీఎస్‌టీ అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖ సెంట్రల్ జీఎస్టీ జోన్ మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీఎస్టీ అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఒక మిషన్ మోడ్ ప్రక్రియలో భాగమని, ఇది దేశ ఖజానాకు వెన్నెముక వంటిదని అభివర్ణించారు. జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో పన్ను అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ దేశ ఖజానాకు పరోక్ష పన్నుల విభాగం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. జీఎస్‌టీ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ మాట్లాడుతూ, విశాఖ జోన్‌లో కేంద్ర పాలిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2017లో 58,000 నుంచి 2024–25 నాటికి 1.80 లక్షలకు పెరిగిందని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వీరు ప్రభుత్వ ఖజానాకు రూ. 25,028 కోట్లు ఆదాయాన్ని అందించారని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఎంఆర్ఆర్ రెడ్డి, డీజీజీఐ ఎస్. శ్రీధర్, ప్రిన్సిపల్ కమిషనర్ రవి కిరణ్ ఈదర ప్రసంగించారు.

వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుల నియామకం

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గంలో పలు వార్డుల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్టు పేర్కొన్నారు.

వార్డు	అధ్యక్షుడి పేరు
40	గుండపు నాగేశ్వరరావు
56	ఆదారి శ్రీనివాసరావు
57	పిన్నింటి అప్పలరాజు
58	గులిగిందల కృష్ణ
59	రేవళ్ల సత్యనారాయణ
60	అంగ వర్మ
61	పిలక రామ్మోహన రెడ్డి
62	భీశెట్టి గణేష్
63	యలగాడ రాజు
89	దొడ్డి లక్ష్మి
90	చుక్క ప్రసాదరెడ్డి
91	చెంగల హరినాథ్
92	గొర్లె అప్పలస్వామి నాయుడు

అధినేతకు ఆత్మీయ కానుక



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి చిత్రపటం అందిస్తున్న యువజన విభాగం నాయకులు దొడ్డి కిరణ్, ఇమ్రాన్, చందు, అంబటి శైలేష్, చిత్రంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం యువజన విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు దొడ్డి కిరణ్, ఇమ్రాన్, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరికూటి చందు, రీజనల్ యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శైలేష్ కలిసి బ్లడ్ ఆర్ట్ చిత్రాన్ని అందించారు.

9న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

గోపాలపట్నం: కార్మిక, ఉద్యోగులు, కర్షకుల సమస్యలపై ఈ నెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ కోరారు. గోపాలపట్నంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం గోపాలపట్నం జోన్ సీఐటీయూ 11వ మహాసభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే విధంగా చట్టాలు తెస్తోందని విమర్శించారు. సంపదంతా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. అందులో భాగంగానే 29 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా తీసుకు వచ్చి కార్మికులకు నష్టం కలిగించే చర్యలు చేపడుతుందని వివరించారు. ఇవి అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు వంటి ప్రాథమిక హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతం రూ.26 వేలు చెల్లించాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన 4000 మంది కాంట్రాక్ట్ కార్మికుల వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పలు రకాల డిమాండ్లతో చేపట్టనున్న సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి బి. జగన్ పాల్గొన్నారు.

జోన్ కమిటీ ఎన్నిక

మహాసభల్లో గోపాలపట్నం జోన్ నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా జె. సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి. అనసూయ, జి శంకర్రావు, ఎంవీ ప్రసాదరావు, వి. రాజు, ప్రధాన కార్యదర్శిగా బి. వెంకటరావు, కార్యదర్శులుగా పీవీఎస్ఎన్ రాజు, ఎస్ పద్మ, ఆర్ మల్లేష్, అప్పలనాయుడు, కోశాధికారిగా శంకర్రావుతో పాటు 24మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

యువతరం సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్

మద్దిలపాలెం: ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. నరసింహారావు అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న సాంకేతికతలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేటి తరం సాంకేతిక యుగంలో ప్రయాణిస్తోందని గుర్తించాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నూతన జ్ఞానాన్ని అందించి, జ్ఞానాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. సీతామాణిక్యం మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలలో అవకాశం కల్పించాలని కోరారు. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీవెన్ మాట్లాడుతూ, విద్యార్థులకు నూతన నైపుణ్యాలను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు స్వశక్తితో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. రెండు వారాల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా వెబ్ డిజైనింగ్ చేయగల సామర్థ్యాన్ని పొందారని, మొత్తం 56 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఏయూక్యాంపస్: బీసీ సామాజిక వర్గానికి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనతో పాటు కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, తక్షణమే బీపీ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, కార్యదర్శి పెదిరెడ్ల శ్రీనివాస్, విశాఖ జిల్లా ఇంచార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇంచార్జి బర్ల పైడం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భాషా సాహిత్యాల సవ్యసాచి ఆచార్య తూమాటి దోణప్ప



దోణప్ప చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య నరసింహారావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆచార్య జిల్లా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆచార్య తూమాటి దోణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తూమాటి దోణప్ప గొప్ప పరిశోధకుడని, ఆయన జీవితం పరిశోధకులకు ఆదర్శమని కొనియాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని, అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం మన భాషకు ఇచ్చే గౌరవమని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రె అప్పారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో దోణప్ప శత జయంతి ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. దోణప్ప ప్రియ శిష్యుడు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఈ సభకు రావడం సభకు నిండుదనం తెచ్చిందని పేర్కొన్నారు. దోణప్ప తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో కృషి చేశారని, తెలుగు వ్యుత్పత్తి పదకోశంలోనూ పనిచేశారని గుర్తు చేశారు. విశిష్ట అతిథి ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆత్మీయ అతిథి ఆచార్య గజ్జ యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్నలు కూడా దోణప్ప పరిశోధనల గొప్పతనాన్ని, రచనల ప్రాముఖ్యతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డి.వి. సూర్య, తెలుగు విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

యువకవులకు ఆదర్శం చోడగిరి



మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

సీతంపేట: సమతా సాహితి నెలవారీ కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రముఖ శతకకర్త చోడగిరి చంద్రరావు సాహిత్యంపై పరిచయ సభ జరిగింది. డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సభకు ఎస్.ఆర్.వేమన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చోడగిరి అంబేద్కర్ వాద కవిత్వం రాశారన్నారు. ఆయన గొప్ప నిబద్ధత గల మహాకవి అని, యువ కవులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధాన వక్త నేలపూడి బాపిరాజు మాట్లాడుతూ చోడగిరి రాసిన భీమశతకం, హృదయ వీణ శతకాలను సభకు పరిచయం చేశారు. చంద్రరావు కవి మాత్రమే కాదని, ఆయన ఒక వైతాళికుడని, ఆయన రాసిన పద్యాలు పండిత, పామరులను మెప్పించాయన్నారు. అంతకు ముందు చోడగిరి జీవిత విశేషాలను డాక్టర్ బండి సత్యనారాయణ సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు సీయార్కే, సామాజిక ఉద్యమ నేతలు వి.వి.దుర్గారావు, బీర రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.